సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 10 । జూన్ । 2024



ఆకట్టుకున్న నృత్య రూపకం
మధురవాడ శిల్పారామం జాతరలో వినోద కార్యక్రమాల్లో భాగంగా కూచిపూడి నృత్యరూపకం అలరించింది. 2లో



ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు
సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. 2లో



వైభవంగా ఆర్జిత సేవలు
సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు 2లో

న్యూస్‌రీల్

బొర్రాకు భారీగా పర్యాటకులు



గుహల్లో అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు పర్యాటకులు పోటెత్తారు.. శనివారం మూడు వేల మంది గుహలను సందర్శించగా రూ. 3 లక్షల ఆదాయం వచ్చింది. ఆదివారం నాలుగు వేల మంది సందర్శించగా రూ.3.91 లక్షల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు. బొర్రా జిప్‌లైన్‌కు సందర్శకుల తాకిడి పెరిగింది. ఆదివారం రూ. 1.16 లక్షల ఆదాయం వచ్చిందని అధికారవర్గాలు తెలిపాయి.

వైభవంగా ధారాలమ్మ పుట్టినరోజు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

మోతుగూడెం : పొల్లూరు ధారాలమ్మ తల్లి పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంఆ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. ఆలయ అర్చకుడు కుమారస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపించారు. అమ్మవారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. వారికి ఎటువంటి అసౌకర్యం లేకుండా ఆలయకమిటీ ఏర్పాట్లు చేసింది.

ఘాట్‌రోడ్డుపైకి బండరాయి



ఘాట్‌రోడ్డుపైకి వచ్చిన బండరాయి

చింతపల్లి రూరల్: మండలంలోని చింతపల్లి ఘాట్‌రోడ్డులో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బండరాళ్లు రోడ్డుపైకి దొర్లుకుంటూ వస్తున్నాయి. ఆదివారం బొండకొండమ్మ తల్లి ఆలయ ప్రాంగణానికి సమీపంలోని రోడ్డుపై బండరాయి జారిపడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ప్రమాదకర పరిస్థితుల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

పాపికొండలకు సందర్శకుల తాకిడి

వీఆర్‌పురం: పాపికొండలకు సందర్శకుల తాకిడి పెరిగింది. ఆదివారం పోచవరం బోట్ పాయింట్‌కు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేసవి సెలవులు చివరి దశకు చేరుకోవడంతో సందర్శకుల సంఖ్య పెరగడానికి కారణమని బోట్ యూనియన్ ప్రతినిధులు తెలిపారు. పది బోట్లలో 550 మంది పాపికొండల వీక్షణకు వెళ్లారని ఏపీ టూరిజం కౌంటర్ అసిస్టెంట్ సీహెచ్.రాజేష్ తెలిపారు.

బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పిస్తాం

- ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు



బడిబయట పిల్లలతో ఉపాధ్యాయుడు

గంగవరం : పాఠశాలలు పునఃప్రారంభించే సమయానికి ఐదేళ్లు నిండిన పిల్లలందరినీ సమీప పాఠశాల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు రంపచోడవరం ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు తెలిపారు. గత నాలుగు రోజులుగా రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పరిధిలో ఈ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోందన్నారు. రంపచోడవరం నియోజకవర్గంలోని 11 మండలాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో 5,829 మంది ఐదేళ్లు నిండిన విద్యార్థులు ఉన్నారన్నారు. వీరందరినీ పాఠశాలలు తెరిచే సమయానికే చేర్పించడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు సుమారు ఐదువేల మంది పిల్లలను ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు నమోదు చేసుకున్నారని ఆయన తెలిపారు.



అమ్మవారి ఆలయం వద్ద ఘటాల ఊరేగింపులో భక్తులు



ఘటాలతో కలెక్టర్ విజయ సునీత, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



దర్శించుకుంటున్న కలెక్టర్ విజయ సునీత, పీవో అభిషేక్, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

- పోటెత్తిన భక్తజనం

మోదకొండమ్మా.. కరుణించమ్మా



మోదకొండమ్మ ఉత్సవాలకు భారీగా తరలివచ్చిన భక్తులు

- పాడేరులో ఘనంగా అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం
- తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తజనం
- కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం
- డప్పు వాయిద్యాలు, థింసా నృత్యాలతో సందడి
- ఇంటి పండగలతో ఆధ్యాత్మిక వాతావరణం

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి గిరిజన జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. భారీగా భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. తీన్‌మార్ డప్పులు, థింసా నృత్యాలతో సతకం పట్టు వరకు ఘటాల ఊరేగింపు హోరెత్తింది. అమ్మవారికి వేకువజామున కలెక్టర్ విజయసునీత, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, ఏఎస్పీ ధీరజ్, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు,వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, డాక్టర్ నర్సింగరావు, డీఆర్వో పద్మావతి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలు, ఇత్తడి ఘటాలకు కుంకుమ పూజలు అనంతరం ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.

గర్భగుడి నుంచి ఊరేగింపుగా..

ఉత్సవ విగ్రహం, పాదాలు, ఇతర ఘటాలను వారంతా గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సతకంపట్టు వద్ద కొలువుదీర్చారు. కలెక్టర్ విజయసునీత, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, మాజీ ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, గిడ్డి ఈశ్వరి, కమిటీ పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊరేగింపులో భారీగా పాల్గొన్న భక్తులు మోదకొండమ్మ తల్లీ.. కరుణించమ్మా అంటూ స్మరించుకున్నారు. ఊరేగింపులో తీన్‌మారు డప్పులు, గరగలు, థింసా నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో సతకంపట్టు వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.భక్తులు ఇంటి పండగలను నిర్వహించి మోదమ్మకు మట్టి ఘటాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొట్టగుళ్లి రామారావు, ప్రసాద్‌నాయుడు, వెంకటరమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతరలో ప్రత్యేక వైద్య శిబిరాలు

పాడేరు : త్సవాల సందర్భంగా పాడేరు పట్టణంలో వైద్యారోగ్య శాఖ అధికారులు ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. పట్టణంలోని పాత బస్టాండ్, సుండ్రుపుట్టు సాయిబాబా ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వైద్యాధికారులు హిమబింధు, రాంబాబు 220 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా పర్యవేక్షించారు.

ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి

జాతరకు వచ్చే భక్తులు తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో సూచించారు. జాతరలో విక్రయించే నిల్వ ఆహార పదార్థాలు, నిల్వ ఉంచిన పానీయాలు తీసుకోవద్దని సూచించారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రస్తుతం ఎపిడమిక్ సీజన్ దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధులు ప్రబలుతే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలో ఉన్న ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యం పొందాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించే ప్రత్యేక వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సిబ్బంది సాంబశివరావు, మురళి, సింహాచలం, చంద్రమ్మ, రత్నకుమారి పాల్గొన్నారు. అమ్మవారి ఘటాన్ని పురవీధుల్లో ఊరేగించారు.



సతకంపట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు



ఘటాల ఊరేగింపులో ఆకట్టుకున్న శక్తి వేషాలు



జెయింట్ వీల్‌పై జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట, ఐటీడీఏ పీవో అభిషేక్, ఇతర అధికారులు



అమ్మవారి జాతరలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరం



ఊరేగింపులో కలెక్టర్ విజయసునీత,జేసీ భావన, పీవో అభిషేక్



సతకంపట్టు వద్ద ఘటాలతో కిక్కిరిసిన భక్తులు



మోదకొండమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం



పిడుగుపాటుకు చీలిపోయిన చెట్టు



కామయ్యపేటలో రోడ్డుపైకి వరదనీరు

హుకుంపేట: మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఉరుములు మెరుపులతో పాటు అక్కడక్కడ పిడుగులు పడటంతో గిరిజనులు భయాందోళనలు చెందారు. స్థానిక వెలుగు కార్యాలయం సమీపంలోని చెట్టు పిడుగుపాటుకు చీలిపోయింది.

సీలేరు: ఆంధ్రా– ఒడిశా సరిహద్దు సీలేరులో ఆదివారం మధ్యాహ్నం నుంచి మూడు గంటల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతీవ్రతకు అల్లాడిన జనం వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి ఉపశమనం పొందారు. ఆదివారం వారపు సంత కావడంతో వ్యాపారులు, గిరిజనులు ఇబ్బందులు పడ్డారు.

డీఈఐ కోర్సులకు దరఖాస్తులు

ఆరిలోవ (విశాఖ): విశాలాక్షినగర్ ప్రాంతం దయాల్‌నగర్‌లో దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్(డీఈఐ)లో నిర్వహిస్తున్న పలు కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇనిస్టిట్యూట్ ఇన్‌చార్జి దక్షిణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్హతతో పలు కోర్సులు న్విహిస్తున్నట్లు పేర్కొన్నారు. డ్రెస్ డిజైనింగ్–టైలరింగ్, కటింగ్–సూయింగ్, టెక్స్‌టైల్స్ డిజైనింగ్–ప్రింటింగ్, మోటార్ వెహికల్ మెకానిజం, ఎలక్ట్రీషియన్ కోర్సులకు దరఖాస్తులు చేసుకోదలిచినవారు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆఫీస్ అసిస్టెంట్–కంప్యూటర్ ఆపరేటర్, మోడల్స్ ఆఫీస్ మేనేజ్‌మెంట్–సెక్రటేరియట్ ప్రాక్టీస్ కోర్సులకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి గల వారు www.dei.ac.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని ఈనెల 26లోగా అందజేయాలన్నారు. వివరాలకు 9963340611 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

253 మందికి ఉచిత వైద్యసేవలు



వైద్యశిబిరంలో సూచనలిస్తున్న స్వామిజీ

రంపచోడవరం : రాజమహేంద్రవరం శ్రీరామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో స్థానిక గిరిజన సంచార వైద్యశాలలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక వైద్యశిబిరంలో రోగులకు వైద్య సేవలు అందించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహరాజ్ తెలిపారు. మేనేజర్ స్వామీ రఘువీరనంద మహరాజ్, ఆఫీస్ ఇంఛార్జి స్వామి వేదవిద్యానందమహరాజ్ పర్యవేక్షించారు. వైద్యులు గోలి వెంకట రామారావు , కస్తూరి సుబ్రమణ్యం, శ్రీకృష్ణ , టీవీ సుబ్బారావు, రాయుడు శ్రీనివాస్, సంపత్ కుమార్, జీఎస్ఎల్ డాక్టర్లు సేవలందించారు. సుమారు 253 మందికి వైద్యం అందించినట్టు స్వామీజీ తెలిపారు. వేమాగిరి పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 65 మందిని పరీక్షించారు. అవసరమైన 30 మందికి కళ్లజోళ్లు అందజేశారు. ముగ్గురిని కంటి ఆపరేషన్లు నిమిత్తం వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆస్పత్రికి తరలించారు. క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వలంటీర్లు ఎల్‌జీవీ భగీరథ రాజు, ఉదయ్ కిరణ్, మంగిరెడ్డి, జయకుమార్, ఆదిత్య పాల్గొన్నారు.

తీరం.. జనసంద్రం



రుషికొండ బీచ్‌కు తరలివచ్చిన పర్యాటకులు



తీరంలో సందర్శకుల సందడి

విశాఖ సాగరతీరానికి ఆదివారం సందర్శకులు పోటెత్తారు. ఉదయం నుంచి భానుడు ప్రతాపం చూపడంతో.. ఉపశమనం పొందేందుకు సాయంత్రం భారీగా తరలి రావడంతో పర్యాటక ప్రాంతాలన్నీ కిటకిటలాడాయి. రామకృష్ణ బీచ్, సాగర్‌నగర్, రుషికొండ, తొట్లకొండ, భీమిలి తదితర తీర ప్రాంతాల్లో యువత, చిన్నారులు స్నానాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు.

– కొమ్మాది/బీచ్‌రోడ్డు (విశాఖ)

- చిట్టడవి కాదు.. పంట కాలువ



వట్టిగెడ్డ జలాశయం పంట కాలువ చిట్టడవిని తలపిస్తోంది. మండలంలోని అప్పలరాజుపేట ప్రాంతంలో గల ఈ జలాశయంపై 3వేల ఎకరాలు సాగవుతున్నాయి. ఆయకట్టుకు నీరందించే ఐదు కిలోమీటర్ల పొడవుగల పంట కాలువ పూడిక, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ఈ కారణంగా రాజవొమ్మంగి, దూసరపాము, తంటికొండ, సీతారాంపురం, డి.మల్లవరం, వట్టిగెడ్డ ప్రాంతాల భూములకు సాగునీరు అందడం లేదు. ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్నందున కాలువలో పిచ్చి మొక్కలు తొలగించి, పూడిక తీత చేపట్టాలని ఆయకట్టుదారులు కోరుతున్నారు.

– రాజవొమ్మంగి

ధారాలమ్మకు ఎమ్మెల్యే పూజలు



అమ్మవారిని దర్శించుకున్న అనంతరం గ్రామస్తులతో అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

సీలేరు: ధారకొండ ఘాట్‌రోడ్డులోని ధారాలమ్మ తల్లిని అరకు ఎమ్మెల్యేగా గెలుపొందిన రేగం మత్స్యలింగం ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ రామకృష్ణ పర్యవేక్షణలో స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రోడ్డు సమస్య పరిష్కారానికి కృషి

అనంతగిరి: మండలంలోని భీంపోల్ పంచాయతీ సరియా గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై అధికారులు దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని, అరకు ఎమ్మెల్యే రేగంమత్స్యలింగను ఎంపీటీసీ సభ్యుడు అశోక్ కోరారు. నూతనంగా ఎమ్మెల్యే ఎన్నికైనా రేగం మత్స్యలింగానికి మర్యాదపూర్వకంగా కలిసి, రోడ్డు సమస్యపై వివరించామన్నారు. దీంతో పాటుగా నాన్ షెడ్యూల్డ్ పంచాయతీల్లో నెలకొన్న పలు సమస్యల పరిష్కరించాలని కోరారు. వైస్ సర్పంచ్ మామిడి అప్పలకొండ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.




ఎమ్మెల్యే రేగం మత్స్యలింగను కలిసి సమస్యను విన్నవిస్తున్న ఎంపీటీసీ అశోక్, తదితరులు

పచ్చదనానికి సపోర్టు

- విశాఖ పోర్టు అథారిటీ కీలక నిర్ణయం
- నగర వ్యాప్తంగా 10 లక్షల మొక్కలు పెంచేందుకు సన్నద్ధం
- ఇప్పటికే 5 లక్షలకు పైగా మొక్కలు నాటిన విశాఖ పోర్టు
- 2025 ఏప్రిల్ నాటికి లక్ష్యాన్ని చేరుకునేలా ప్రణాళికలు
- కాలుష్య నియంత్రణకు ప్రకృతి సిద్ధ నివారణే మార్గమని నిర్ణయం



మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పోర్టు చైర్మన్ డా.అంగముత్తు



విశాఖపట్నం పోర్టు

సాక్షి, విశాఖపట్నం : కాలుష్యం పెరుగుతోందంటూ వస్తున్న విమర్శలను ప్రకృతి సిద్ధంగా తిప్పికొడుతూ పర్యావరణహిత ప్రణాళికలతో విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) ముందడుగు వేస్తోంది. ఇప్పటికే పోర్టు పరిసరాల్లో లక్షలాది మొక్కలు నాటి కాలుష్య నివారణ చర్యలకు ఉపక్రమించిన పోర్టు ఈసారి భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా మహా విశాఖ నగరంలో 10 లక్షలు మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తమ భుజస్కందాలపైకెత్తుకుంది. ప్రగతి విశాఖకు పచ్చల హారాన్ని తొడిగేందుకు పోర్టు సన్నద్ధమవుతోంది.

ఏడాదిలో 10 లక్షల మొక్కలు

పర్యావరణ దినోత్సవం సందర్భంగా పోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో విశాఖ నగర పరిధిలో ఏకంగా 10 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించింది. ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ల్యాండ్ రెస్టోరేషన్ స్టాపింగ్ డీ సర్టిఫికేషన్ అండ్ బిల్డింగ్ డ్రాట్ రెసిలియన్స్ థీమ్‌తో నిర్వహిస్తున్న నేపథ్యంలో పోర్టు చైర్మన్ డా.అంగముత్తు ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. ఇందుకనుగుణంగా కేవలం 3 నెలల వ్యవధిలోనే 10 లక్షల మొక్కలు నాటేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. రూ.15 కోట్లతో పోర్టుకు చెందిన 186 ఎకరాల్లో మొక్కలు పెంచనున్నారు. 2025 మార్చి నాటికి ప్రతి మొక్క బతికేలా పోర్టు సంరక్షణ బాధ్యతలు తీసుకోనుంది. ఈ మొక్కల పెంపకం వల్ల కాలుష్యం నివారించడంతో పాటు విశాఖలో ఉష్ణతాపాన్ని కూడా కొంత మేర తగ్గించే అవకాశం ఉందని పోర్టు భావిస్తోంది. గ్లోబల్ వార్మింగ్ కారణంగా దేశ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతుండటంతో మొక్కల పెంపకం వల్ల విశాఖ నగరంలో చల్లదనం పరచుకుంటుందని దీని ద్వారా ఉష్ణోగ్రతలు నియంత్రించే అవకాశం ఉంటుందని పోర్టు అధికారులు చెబుతున్నారు. 10 లక్షల మొక్కలు నాటడంలో భాగంగానే.. సబ్బవరంలోని ఇండియన్ మారీటైం యూనివర్సిటీలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర అటవీ శాఖతో కలిసి సుమారు 4 ఎకరాల్లో 2 వేల మొక్కలను పెంచనుంది.

ధూళి ఎగరకుండా చర్యలు

మహావిశాఖ నగరాన్ని ఆనుకొని ఉన్న విశాఖపట్నం పోర్టు కారణంగా కాలుష్యం పెరుగుతోంది. దుమ్ము కణాలు, నల్లటి మసిపొడి ఎంవీపీ కాలనీ వరకూ విస్తరిస్తోంది. దీన్ని నివారించేందుకు కవర్డ్ షెడ్లు ఏర్పాటు చేయడంతో పాటు బొగ్గు నిల్వలపై ఎప్పటికప్పుడు నీటి పిచికారీ చేసి ధూళి ఎగరకుండా చర్యలు తీసుకుంటోంది. మూడేళ్లుగా పోర్టు పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తారంగా నిర్వహిస్తోంది. పోర్టు చుట్టు పక్కల పచ్చదనాన్ని పెంపొందించేందుకు 650 ఎకరాల్లో 5,65,500 మొక్కలను నాటారు. అయినప్పటికీ కాలుష్యం పెరుగుతోందంటూ విమర్శలు వెల్లువెత్తుతుండటంతో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించింది.

ఆకట్టుకున్న నృత్య రూపకం

పీఎంపాలెం (విశాఖ) : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు శిల్పారామం (జాతర)లోని కళా వేదికపై ప్రదర్శించిన శ్రీసాయిచరిత్ర కూచిపూడి నృత్య రూపకం ప్రేక్షకులను అలరించింది. నగరంలోని జోష్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శన ఆద్యంతం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. శ్రీ షిర్డీ సాయిబాబా జీవిత చరిత్రలోని ప్రధాన ఘట్టాలను కళ్లకు కట్టినట్టు నృత్య రూపకంలో ప్రదర్శించారు. కళాకారులు కేశవ్, అన్నపూర్ణ, మోహన్, సంజన, రమ్య, యశశ్రీ, భాసిత, ఆశాలత, చిన్ని, ప్రసన్న, శిరీష, హాష్య, సౌజన్య తదితరులు నృత్యం చేయగా మురళీ గోవింద నృత్య దర్శకత్వం వహించారు. స్థానిక ఏవో విశ్వనాథరెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

బాలికను రక్షించిన లైఫ్‌గార్డ్స్



బాలికను రక్షించిన లైఫ్‌గార్డ్స్

దాబాగార్డెన్స్: ఆర్.కె.బీచ్ వద్ద సముద్రంలో మునిగిపోతున్న బాలికను జీవీఎంసీ లైఫ్ గార్డ్స్ రక్షించారు. రామ్‌నగర్‌కు చెందిన సుధా అనే బాలిక ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి ఆర్.కె.బీచ్‌కు వచ్చింది. ఈ క్రమంలో స్నానానికి దిగిన ఆ బాలిక అలల తాకిడికి లోపలికి వెళ్లిపోతున్నట్టు లైఫ్‌గార్డ్‌లు ఆనంద్, వాసు, అచ్చెన్న గమనించారు. వెంటనే రంగంలోకి దిగి ఆమెను రక్షించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సముద్ర స్నానాలకు దిగే సందర్శకులు అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ విజ్ఞప్తి చేశారు.

వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేసి 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమండంలోని వేదికపై అధిష్ఠంపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు, భక్తులు

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

కొమ్మాది : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

నవ్వుల్లో ముంచెత్తిన హాస్య వల్లరి

సీతంపేట: విశాఖ హ్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన హాస్య వల్లరి ఆహుతులను కడుపుబ్బా నవ్వించింది. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రావి గోపీకృష్ణ, ఎస్.ఎస్.రామానుజం పర్యవేక్షణలో పలువురు కళాకారులు స్కిట్లు ప్రదర్శించారు. వీటిలో వైఫై పాస్‌వర్డ్, టైమెంత, పనిమనిషి, ఎందుకలా ఏడుస్తున్నావ్, క్రికెట్ పిచ్చి, బామ్మగారు కోర్టు సీను, భోషాణం పెట్టె, నా హృదయం కొట్టేసారు, మిఠాయి సత్యం, షాపింగ్‌కు వెళ్తున్నా ఏం కావాలి, పెళ్లి రెండు స్వీట్లు, వాడు మన స్టాఫ్ కాదు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ స్కిట్లు ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తాయి. కళాకారులు రావి గోపీకృష్ణ, రామానుజం, భానుప్రకాష్, డి.ఎస్.ఎన్.మూర్తి, ఆర్.ఎస్. ఎస్.మూర్తి, నాగగణేష్, నాయుడు, శివజ్యోతి, ప్రసన్న స్కిట్లు ప్రదర్శించి అలరించారు.

బైక్‌పై లిఫ్ట్ ఇచ్చి చాకుతో దాడి

దేవరాపల్లి: తెల్లవారుజామున బస్సులు ఇతర వాహనాలు లేకపోవడంతో లిఫ్ట్ అడిగిన పాపానికి ఓ యువకుడిపై గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు చాకుతో దాడి చేశారు. అతడి వద్ద రూ.5 వేలతో పర్సును, సెల్‌ఫోన్‌ను ఎత్తుకుపోయారు. దేవరాపల్లిలో ఆదివారం వేకువ జామున 5 గంటల ప్రాంతంలో ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం... విజయనగరం జిల్లా ఎస్. కోట మండలం వెంకటరమణపేటకు చెందిన జవ్వాది శ్రీను(32) విశాఖ నుంచి దేవరాపల్లిలో తన అత్తవారింటికి శనివారం రాత్రి బయలుదేరాడు. కొత్తవలస వరకు బస్సులోను, అక్కడ నుంచి వావిలపాడు జంక్షన్ వరకు క్వారీ లారీ మీద చేరుకున్నాడు. అక్కడ ఏ వాహనం దొరక్కపోవడంతో దేవరాపల్లికి నడుచుకుంటూ బయలుదేరాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై దేవరాపల్లి వైపు వస్తుండగా, వారిని ఆపి తీసుకెళ్లాలని కోరాడు. అతడిని ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని దేవరాపల్లిలో దించకుండా శారదా నది వంతెన వైపు నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ అతడి జేబులో పర్సు, సెల్‌ఫోను ఇవ్వకపోతే చంపేస్తామంటూ చాకుతో బెదిరించారు. దీంతో భయబడిన శ్రీను రూ.5 వేలతో పర్సు ఇచ్చేసి, సెల్‌ఫోన్ ఇవ్వడానికి నిరాకరించాడు. దీంతో రెచ్చిపోయిన యువకులు అతనిపై చాకుతో దాడికి దిగారు. ఈ దాడిలో శ్రీను చేతి వేళ్లు, తలతోపాటు శరీరంలో పలు చోట్ల విచక్షణా రహితంగా తీవ్రంగా గాయపర్చారు. దాంతో సెల్‌ఫోను వారికిచ్చేసి ప్రాణభయంతో పరుగులు తీశాడు. అయినా అతడిని వెంబడించడంతో వంతెన దగ్గరలో ఇటుక బట్టీలు వద్దకు చేరుకుని, పెద్ద గా కేకలు వేయడంతో అక్కడ వారంతా నిద్రలేచి చూసేసరికి దాడికి పాల్పడిన యువకులు పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన శ్రీనును దేవరాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కె. కోటపాడు ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎస్‌ఐ డి. నాగేంద్ర కేసు నమోదు చేశారు. ఈ దాడికి పాల్పడిన వారి గురించి ఆరా తీస్తున్నామన్నారు.

'మృగశిర' వచ్చినా

ముచ్చెమటలే!

- కొనసాగుతున్న ఉష్ణతాపం, ఉక్కపోత
- గాలిలో తేమ శాతం పెరుగుదలే కారణం
- మరో మూడు రోజులు అసౌకర్య వాతావరణం



నిర్మానుష్యంగా ప్రధాన రహదారి

సాక్షి, విశాఖపట్నం: రోహిణీ కార్తె పది రోజులకు పైగా ప్రభావం చూపించింది. ఉష్ణతాపం, ఉక్కపోత కలగలిసి జనాన్ని ఉక్కిరి బిక్కిరి చేసింది. ఏటా వేసవిలో రోహిణి కార్తె ప్రభావం అలాగే ఉంటుందని అంతా భరించారు. అయితే రోహిణి కార్తె వెళ్లిపోయాక మృగశిర కార్తె రాకతో వాతావరణం చల్లబడుతుందని భావించారు. కానీ రోహిణి వెళ్లిపోయి శనివారం నుంచి మృగశిర కార్తె ప్రవేశించింది. కానీ పరిస్థితిలో ఏమంత మార్పు కనిపించలేదు. ఉష్ణ తీవ్రతతో పాటు ఉక్కపోత కూడా కొనసాగుతూనే ఉంది. తగ్గేదే లే.. అన్నట్టు ముచ్చెమటలు పోస్తూనే ఉన్నాయి. భానుడు కూడా సుర్రుమంటూనే ఉన్నాడు. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మృగశిర కార్తె వచ్చినా చల్లదనం కానరావడం లేదంటూ నిట్టూరుస్తున్నారు. ప్రస్తుతం గాలిలో తేమ శాతం అధికంగా ఉండడమే ప్రస్తుత పరిస్థితికి కారణమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. కొద్ది రోజులుగా విశాఖలో గాలిలో తేమ 70–80 శాతానికి పైగా నమోదవుతోంది. గాలిలో తేమ 60 శాతానికి మించితే ఉక్కపోత ఊపందుకుంటుంది. కానీ ఇప్పుడు అంతకంటే ఎక్కువగా నమోదవుతుండడం వల్ల ఉక్కపోత కొనసాగుతోంది. మరోవైపు నగరంలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణంకంటే రెండు మూడు డిగ్రీలు అధికంగా 34–36 డిగ్రీల మధ్య రికార్డవుతున్నాయి. ఇలా ఒకపక్క ఉక్కపోత, మరోపక్క ఉష్ణతాపం వెరసి నగర వాసుల్ని అవస్థల పాల్జేస్తున్నాయి. మరో రెండు మూడు రోజులు ఇదే వాతావరణం కొనసాగుతుందని, ఆపై కాస్త ఉపశమనం కలిగిస్తుందని వాతావరణ నిపుణులు భరోసా ఇస్తున్నారు.

టీకాలే శ్రీరామరక్ష



- చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి
- ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ

మహారాణిపేట: గర్భిణులతో పాటు అప్పుడే పుట్టిన చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలని వైద్యులు సూచిస్తున్నారు. అయితే చాలా మందికి, టీకాలపై సరైన అవగాహన లేకపోవడంతో అనేక రకాల వ్యాధులకు గురవుతున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందజేసే ఈ వ్యాధి నిరోధక టీకాలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని వైద్యులు చెబుతున్నారు. ప్రతీ బుధవారం, శనివారం గర్భిణులకు, చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు వేస్తారు.

- గర్భిణిగా నిర్ధారణ అయిన వెంటనే 3 నెలలు నిండిన తర్వాత టి.టి. ఇంజక్షన్ వేయాలి. నెల వ్యవధిలో మరో టి.టి. వేయాలి. వీటితో పాటు ఐరన్–ఫోలిక్, కాల్షియం టాబ్లెట్లు ఇస్తారు. ప్రసవం అనంతరం ఐరన్ మాత్రలు ఇస్తారు.
- అప్పుడే పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హెపటైటిస్ బి డోస్ వేయాలి. వీటి వల్ల పోలియో, పచ్చ కామెర్ల వ్యాధి నుంచి చిన్నారిని కాపాడవచ్చు.
- 14 రోజుల వ్యవధిలో బి.సి.జి(క్షయ వ్యాధి రాకుండా) టీకా వేయాలి. ఇది 6 వారాలు, 14 వారాల్లో ఐ.పి.వి. చుక్కలు వేయాలి. వీటితో పాటు 6 వారాలు, 10, 14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటావాలెంట్ వేయాలి. వీటి వల్ల కోరింత దగ్గు, కంఠసర్పి, ధనుర్వాతం, మెదడు వాపు వ్యాధి, పచ్చకామెర్లు రాకుండా చిన్నారిని కాపాడుకోవచ్చు.
- 9 నెలల నుంచి 12వ నెల వ్యవధిలో తట్టు వ్యాధి రాకుండా మీజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్ 'ఎ' చుక్కలు వేయాలి.
- 16 నెలల నుంచి 24 నెలల వ్యవధిలో బూస్టర్ డోస్ డీపీటీ, మీజిల్స్, విటమిన్ 'ఎ' ఓపీవీ వేయాలి.
- 5 సంవత్సరాలు పూర్తయితే డి.పి.టి ఒక డోస్ వేయాలి.
- 10 సంవత్సరాలు, 16 సంవత్సరాలు పూర్తయితే టెట్నాస్ (టీ.టీ) వేయాలి. 9 నెలల నుంచి 5 సంవత్సరాల వయసు లోపల ప్రతి 6 నెలలకు ఓసారి విటమిన్ 'ఎ' 9 డోస్లు వేయాలి.

అవగాహన అవసరం



గర్భిణులకు, చిన్నారులకు నిర్దేశిత వేళల్లో వ్యాధి నిరోధక టీకాలు వేయాలి. వీటి వల్ల ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు.

– సీహెచ్ పూర్ణేంద్ర బాబు, వ్యాక్సినేషన్ నోడల్ అధికారి, టీబీ నివారణ అధికారి

నూకాంబిక దర్శనానికి పోటెత్తిన భక్తులు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. విశాఖ ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. శనివారం రాత్రి కొంతమంది భక్తులు వారి ఇళ్ల వద్ద అమ్మవారి పాట నిర్వహించి ఆదివారం ఉదయం కాలినడకన ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. పలువురు ఆలయం వద్ద వంటలు చేసుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పలు స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు ఉచితంగా మజ్జిగ, ప్రసాదం పంపిణీ చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో బండారు ప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కొత్త అందాలు



ఆకట్టుకుంటున్న గ్రీనరీ



న్యూలుక్‌లో ఏర్పాటు చేసిన బెంచి



స్టూడియోపై ఏర్పాటు చేసిన బుద్ధ విగ్రహం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురం కొండపైగల డా. డి. రామానాయుడు ఫిల్మిం స్టూడియోకు న్యూలుక్ వచ్చింది. ఇప్పటికే కొండపై పోలీస్ స్టేషన్, షాపింగ్ మాల్స్, గుడి, భారీ మహల్, ఆహ్లాదకర వాతావరణంతో పాటు కనుచూపు మేరలో కనిపించే నీలి కడలి సంద్రం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. అయితే పర్యాటకులను ప్రత్యేకంగా ఆకర్షించుకునేందుకు పలు ఆకృతులను ఇక్కడ ఏర్పాటు చేసినట్లు స్టూడియో మేనేజర్ వంశీ తెలిపారు. బుద్ధుని ధ్యాన విగ్రహం, ఫొటో షూట్ కోసం దిల్ సింబల్, తల్లి, బిడ్డ విగ్రహంతో పాటు పలు ఆకృతులను ఏర్పాటు చేశారు. ఫొటో షూట్‌లకు, సినిమా షూటింగ్ చిత్రీకరణకు మరింతగా ఆకట్టుకునేందుకు పలు నిర్మాణాలు త్వరలో జరగబోతున్నట్లు పేర్కొన్నారు.



ఫొటో షూట్ కోసం దిల్ సింబల్



ఏర్పాటు చేసిన కళాకృతులు

'మెగాస్టార్ ఫ్యాన్' చిత్రం రిలీజ్ పోస్టర్ ఆవిష్కరణ

దాబాగార్డెన్స్ : మెగాస్టార్ ఫ్యాన్ చిత్రం రిలీజ్ పోస్టర్ ఆవిష్కరణ ఆదివారం సిటీ చిరంజీవి ఫ్యాన్స్ యువత అధ్యక్షుడు వానపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో జరిగింది. అల్లు ప్రొడక్షన్ బ్యానర్‌పై కిరణ్ వారియర్ దర్శకత్వంలో లుక్స్ రాజ్ హీరోగా, సోనిరెడ్డి హీరోయిన్‌గా అల్లు శ్రీరాములునాయుడు నిర్మాతగా నిర్మించిన ఈ చిత్రం పోస్టర్ రిలీజ్ నగరంలోని క్రాంతి పిక్చర్స్ కార్యాలయంలో నిర్వహించారు. పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్న క్రాంతి పిక్చర్స్ అధినేత ఎస్‌వీ రెడ్డి మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి సమాజానికి అందించిన సేవలను స్ఫూర్తిగా తీసుకుని ఈ చిత్రం నిర్మించామని, చిత్రంలో తాను ఓ ముఖ్య పాత్రలో నటిస్తున్నట్టు చెప్పారు. దర్శకుడు కిరణ్ తన పాత్రను అమోఘంగా తీర్చిదిద్దాడని చెప్పారు. దర్శకుడు కిరణ్ మాట్లాడుతూ కేవలం చిరంజీవి అభిమానులకే కాక, అన్ని వర్గాల ప్రేక్షకులకు ఆకట్టుకునే చిత్రంగా ఉంటుందన్నారు. ఈ చిత్రం ముఖ్యంగా యువతను అలరించనుందన్నారు. సత్తి రామకృష్ణారెడ్డి, వెంకట్రావు, నిర్మాత, దర్శకుడు సత్యారెడ్డి, కొండలరావు, శ్రీరామదాసు గోవింద్, కోయిలాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణంపై హర్షం



రామాలయం వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలో రామాలయ వీధిలో రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉండిపోవడంతో ఆ వీధిలో ప్రజలు రాకపోకల విషయంలో తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. సమస్య పరిష్కారానికి మండల సర్పంచ్‌ల సంఘం ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత ప్రత్యేక చొరవ తీసుకున్నారు.ఈ మేరకు పంచాయతీ నిధులతో ఆ వీధిలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబ అమ్మవార్లు

రాజవొమ్మంగి: స్థానిక శివాలయం కొండపై గల ఆలయంలో ఆదివారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ కల్యాణం వైభవంగా జరిగింది. తొలుత సత్యనారాయణ-వెంకటరమణ దంపతులచే తొలుత పురోహితులు కృష్ణశర్మ శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. విశ్వబ్రాహ్మణ సంఘం మండలశాఖ ఆధ్వర్యంలో స్వామి వార్లకు వైదిక పద్ధతిలో కల్యాణ వేడుక జరిగింది. అనంతరం భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

అనంతగిరి: మండలంలోని రొంపల్లి పంచాయతీ బూరుగు, చినకోనెల గ్రామాల్లో తక్షణమే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు డిమాండ్ చేశారు. కలుషితమైన నీరు వినియోగంతో పాటు మలేరియా బారిన పడి విజయనగరం జిల్లా గజపతినగరం, ఎస్‌కోట ఆస్పత్రుల్లో పలువురు గిరిజనులు ప్రస్తుతం వైద్యసేవలు పొందుతున్నారన్నారు. బూరుగు గ్రామంలో 35 కుటుంబాలు, చినకోనెల గ్రామంలో 25 కుటుంబాల గిరిజనులు జీవిస్తున్నారు. ప్రతి ఏడాది మలేరియా కేసులు అధికంగా నమోదవుతుండడంతో నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, డిమాండ్ చేశారు. అలాగే జల్‌జీవన్‌మిషన్‌లో బోరు ఏర్పాటు చేసినప్పటికీ కనెక్షన్ ఇవ్వలేదని, దీంతో పాటుగా విద్యుత్ సౌకర్యం సమస్యను పరిష్కరించాలని కోరారు.

ముమ్మరంగా తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

దేవీపట్నం/రంపచోడవరం: ఇందుకురూ గ్రామ సమీపంలో దేవీపట్నం పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలకు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన వారికి జరిమానా విధించారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తున్న, మితిమీరిన వేగంతో ఆటోలు నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ నాగార్జున చెప్పారు.

60 మందికి వైద్య పరీక్షలు

చింతపల్లిరూరల్: గూడెం కొత్తవీధి మండలం జెర్రెల పంచాయతీ జెర్రెల కొత్తూరు గ్రామంలో ఆదివారం జెర్రెల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 60 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేసినట్టు డాక్టర్ మణిదీప్ తెలిపారు.

విత్తనాలు నిండుగ.. అన్నదాత పండగ

- ఖరీఫ్ పనులు ప్రారంభం
- సబ్సిడీపై విత్తనాలు
- రైతుల హర్షం

ఆర్‌జీఎల్(శ్రీకాకుళం సన్నాలు)
157.5 క్వింటాళ్లు
ఎంటీయూ (శ్రీధృతి 1121)
138.6 క్వింటాళ్లు
ఎంటీయూ (ఎర్రవడ్లు)
27 క్వింటాళ్లు
పీటీ (సాంబమాసురి)
52.04 క్వింటాళ్లు
పచ్చిరొట్ట విత్తనాలు
31.8 క్వింటాళ్లు
వేరుశనగ
6.6 క్వింటాళ్లు ఉన్నాయి.



రైతు భరోసా కేంద్రంలో విత్తన నిల్వలు



విత్తనాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

అనంతగిరి: ఖరీఫ్ సీజన్‌లో ముందే విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులోకి వచ్చాయి.. ప్రస్తుతం ఏజెన్సీ వ్యాప్తంగా ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆనందానికి అవధ్లు లేకుండాపోయింది. పోలాల్లో సంవృద్ధిగా నీరు చేరింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వరి వేసేందుకు గిరిజనులు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్ సీజన్ సాగుకు వాతావరణం అనుకూలంగా ఉండడంతో గిరిజన రైతులు ఆనందపడుతున్నారు. గత నెలరోజులుగా మన్యంలోని భారీ వర్షాలు కురుస్తుండడంతో పంటపొలాల్లోకి నీరుచేరుతుంది. వరి సాగు పనుల్లో గిరిజన రైతులు నిమగ్నమైయ్యేందుకు సిద్ధమవుతున్నారు.

అందుబాటులో వివిధ రకాల విత్తనాలు

అనంతగిరి, చిలకలగెడ్డ, కాశీపట్నం, రొంపల్లి, గుమ్మకోట, బొర్రా, కొండిబ, ఎన్.ఆర్.పురం, భీంపోల్, పెదకోట తదితర రైతు భరోసా కేంద్రాల్లో నాలుగు రకాల వరి విత్తనాలు, పట్టిరొట్ట విత్తనాలు, వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.

90 శాతం సబ్సిడీతో విత్తనాలు



ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో 90శాతం సబ్సిడీతో పది రైతు భరోసా కేంద్రాల్లో వరి, వేరుశెనగ, పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పంటల సాగుపై రైతులకు తరచూ సూచనలు, సలహాలు ఇస్తున్నాం. – ఉమామహేశ్వరీ, మండల వ్యవసాయాధికారి, అనంతగిరి

కనుల పండువగా అమ్మవారి ఉత్సవాలు

- మోదమ్మకొండమ్మ వేడుకలు ప్రారంభం
- శతకంపుట్టలో కొలువుదీరిన అమ్మవారు
- అమ్మవారి పాదాలు, ఘటాలు, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు
- తరలివచ్చిన భక్తులు



శతకంపట్టులో కొలువు దీరిన ఉత్సవ విగ్రహం, పాదాలు, ఘటాలు



ఉత్సవ విగ్రహాన్ని ఎత్తుకున్న ఎంపీపీ బొండా వరహాలమ్మ

పెదబయలు: మన్య ప్రజలు ఆరాధ్య దైవం, వనదేవత పెదబయలు మోదకొండమ్మ తల్లి మూడు రోజుల ఉత్సవాలు ఆదివారం నుంచి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలు ఘటాలను అమ్మవారి ఆలయం నుంచి డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి శతకంపట్టులో కొలువుదీర్చారు. స్థానిక ఎంపీపీ బొండా వరహాలమ్మ, జోగి రాము, ఉత్సవ కమిటీ నాయకులు ఉత్సవ విగ్రహాన్ని, పాదాలను ఎత్తుకుని ఉత్సవాలు ప్రారంభించారు. ఉత్సవ విగ్రహం, పాదాలు, ఘటాలను మోశారు. ఊరేగింపులో అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలను ఎత్తుకోవడానికి మహిళలు, భక్తులు పోటీ పడ్డారు. గంటన్నరపాటు ఊరేగింపు జరిగింది .అనంతరం శతకంపట్టులో అమ్మవారిని కొలువుదీర్చారు.మూడు రోజుల ఉత్సవాలకు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.

భారీగా బందోబస్తు

పెదబయలు జాతర ఉత్సవాలకు పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.అలాగే మూడు రోజుల పాటు ఉత్సవాలకు 150 మంది పోలీసులతో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. బాంబు స్క్వాడ్ రెండు కిలో మీటర్ల మేర తనిఖీలు చేపట్టారు. పూర్తి బందోబస్తును జి.మాడుగుల సీఐ రమేష్ ,పెదబయలు ఎస్‌ఐ మనోజ్‌కుమార్ పర్యవేక్షించారు. పూజా కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గంపరాయి సూరయ్య, మాజీ జెడ్పీటీసీ జర్సింగి గంగాభవాని, మాజీ సర్పంచ్ దడియా రాంబాబు, ఉత్సవ కమిటీ నాయకులు చెండా చిట్టిబాబు, జర్సింగి పూర్ణచంద్‌రావు, లాలీబాబు, పూర్ణయ్య, శశిధర్, చక్రదర్, చెండా రమేష్‌కుమార్, అజయ్‌కుమార్, పరుశురాం , వర్తకులు, ఉద్యోగ ఉపాధ్యాయులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



శతకం పట్టులో అమ్మవారిని దర్శించుకున్న పార్టీ నాయకులు

పైనాపిల్ సీజన్ ప్రారంభం



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న పైనాపిల్



పైనాపిల్ సాగు



పైనాపిల్

సాక్షి, పాడేరు: సేంద్రియ పద్ధతిలో కొండపోడు, మెట్ట భూముల్లో గిరిజన రైతులు సాగుచేస్తున్న పైనాపిల్ పండ్ల దిగుబడి దశతో అమ్మకాలు ప్రారంభమయ్యాయి. పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, చింతపల్లి మండలాల్లో పైనాపిల్ సాగు అధికంగా ఉంది. పాడేరు మండలం వంట్లమామిడి, చింతపల్లి మండలం చిత్రాలగొప్పు గ్రామాల్లో గిరిజనులు ఈ సీజన్‌లో పైనాపిల్‌ను పెద్ద మొత్తంలో అమ్మకాలు జరుపుతారు. పాడేరు, వంట్లమామిడి, తాజంగి, జి.మాడుగుల, లోతుగెడ్డ జంక్షన్‌లలో జరిగే వారపు సంతల్లో ప్రస్తుతం పైనాపిల్ అమ్మకాలు భారీగా జరుగుతున్నాయి. మైదాన ప్రాంతాలకు చెందిన జ్యూస్, పండ్ల వ్యాపారులు వీటిని కొనుగోలు చేసి తరలిస్తున్నారు. రుచిలో నంబర్–1గా ఉండే మన్యం పైనాపిల్ పండ్లకు మైదాన ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. ప్రస్తుతం పైనాపిల్ ఒక్కంటిని రూ.20లతో గిరిజనులు అమ్మకాలు జరుపుతుండడంతో మంచి ఆదాయం నెలకొంది. ఏజెన్సీలో సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో సాగవుతున్న పైనాపిల్‌తో ప్రతి ఏడాది గిరిజన రైతులకు అధిక లాభాలు వస్తున్నాయి. సెప్టెంబర్ నెల వరకు మన్యంలో పైనాపిల్ వ్యాపారం జరుగుతుంది.

రాయితీపై విత్తనాలు



రామకృష్ణ

చింతపల్లిరూరల్: రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని గూడెం కొత్తవీధి మండలం దామనపల్లి సర్పంచ్ కుందేరి రామకృష్ణ అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ దామనపల్లి రైతుభరోసా కేంద్రంలో విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులకు సోమవారం నుంచి పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. రైతులు ఆధార్‌కార్డు, భూమిపట్టాదారు పాసుపుస్తకం, వినియోగంలో ఉన్న ఫోన్‌ను తీసుకురావాలని సూచించారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం : కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ లండా రమణ, సిబ్బంది, పాలకవర్గ సభ్యులు భక్తుల సౌకర్యాలు పర్యవేక్షించారు.

గ్రామాల్లో విస్తృతంగా అడ్మిషన్ డ్రైవ్



అంబేడ్కర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

రాజవొమ్మంగి: మీ పిల్లల్ని ప్రభుత్వం గిరిజన సంక్షేమ పాఠశాలల్లో చేర్పించండి అంటూ బోర్నగూడెం, అమీనాబాద్ ఆశ్రమోన్నత ఉపాధ్యాయులు బొడారపు కృష్ణ, విజయకుమారి ఆదివారం అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు సీట్లు ఖాళీ ఉన్నట్టు విస్తృత ప్రచారం చేశారు. 5, 6 తరగతుల్లో ఉత్తీర్ణత పొందిన వారు వెంటనే పై తరగతుల్లో అడ్మిషన్ పొందాలని అవగాహన కల్పించారు. ఆయా పాఠశాలల్లో కార్పొరేట్‌లకు దీటుగా అన్ని సదుపాయాలు ఉన్నాయని, ఆహ్లాదకరమైన వాతావరణంలో, నాణ్యమైన విద్యతో పాటు వసతి, ఉచిత భోజన సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. మండలంలోని వాల్మీకినగర్, అప్పలరాజుపేట, అంబేడ్కర్‌నగర్, విద్యానగర్, శాంతినగర్, కమ్మరిపేట తదితర జనావాసాల్లో పిల్లల తల్లిదండ్రులను కలసి వివరించారు.

కొర్రాజుల జాతరకు ఏర్పాట్లు పూర్తి



రేఖపల్లిలో ముత్యాలమ్మ వారికి ముడుపుకట్టిన దృశ్యం

వీఆర్ పురం: రేఖపల్లి చెరువు సమీపంలో పోతురాజు గద్దె వద్ద ప్రతీ మూడేళ్ల కొకసారి నిర్వహించే కొర్రాజుల జాతరను ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు జాతర కమిటీ సభ్యులు గత వారం రోజుల నుంచి ఏర్పాట్లను ముమ్మరంగా చేపడుతున్నారు. శనివారం రాత్రి ముత్యాలమ్మకు ముడుపులు కట్టి జాతర పనులను నిర్వాహకులు ప్రారంభించారు. ఈ నెల 18 వ తేదీ వరకు సుమారు పది రోజుల పాటు కొనసాగే ఈ జాతర చివరి రోజు అగ్ని గుండం తొక్కడంతో ముగుస్తుంది. గద్దెకు 20 కిలోమీటర్ల దూరంలోని దారపల్లి గ్రామంలో కొలువుదీరిన పెదసార్లమ్మ, కొటారిగొమ్ము గ్రామంలో కొలువుదీరిన చినసార్లమ్మ అమ్మవారులను పూజారులు సూత్రు పోతిరెడ్డి, అందెల లచ్చిరెడ్లు అర్యణ మార్గం మీదుగా డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా కుమారుడు కొలువుదీరిన రేఖపల్లి గద్దె వద్దకు ఈ నెల 13న జాతరలో భాగంగా తోడ్కొని రావడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. గద్దె వద్ద కుమారుడు పోతురాజు వద్ద అమ్మవార్ల ప్రతిమలను ఉంచి ప్రధాన పూజారి పాండురాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు రానున్నట్టు తెలిపారు.

పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పేద విద్యార్థులకు నోట్‌బుక్స్, షూస్, యూనిఫాం అందజేస్తున్న కిల్లో సురేంద్ర

అనంతగిరి: మండలంలోని అరకు గ్రామంలోని నిరుపేద విద్యార్థులకు యూనిటీ ఫర్ చారిటీ స్వచ్ఛంద సంస్థ నోట్ పుస్తకాలు, షూస్, యూనిఫాంలను సమకూర్చింది. ఈ సందర్భంగా గ్రామంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర ఆ స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన పుస్తకాలు, షూస్, యూనిఫాం ఇతరత్రా స్టేషనరీ సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలోని సుమారు 40 మంది ఆదివాసీ నిరుపేద విద్యార్థులను యూనిటీ ఫర్ చారిటీ స్వచ్ఛంద సంస్థ దత్తత తీసుకొని పలు ప్రైవేట్ పాఠశాలల్లో చదివిస్తోందన్నారు. నిరుపేద విద్యార్థులను అన్ని విధాలుగా ఆదుకుంటున్న ఆ సంస్థ సేవలను కొనియాడారు. ఏజెన్సీలోని అన్ని ప్రాంతంలోని మరిన్ని సేవ కార్యక్రమాలు చేపట్టాలని, అందుకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. సంస్థ సభ్యులు నారాయణరావు, మేరీ జాస్మిన్, సింహాచలం, టి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

కొయ్యూరు: రావణాపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో మూడు నుంచి తొమ్మిదో తరగతి వరకు సీట్లు ఖాళీలున్నాయని, ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవచ్చని హెచ్‌ఎం మృదుబాషిణి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా పాఠశాలలో మూడో తరగతిలో-80, నాలుగులో-77, అయిదులో- 72, ఆరులో-60, ఏడులో-15, ఎనిమిదిలో-5,తొమ్మిదిలో-35 సీట్లకు ఖాళీలున్నాయన్నారు. బాలికలు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు. ఒకటో తరగతిలో 80 వరకు ఖాళీలున్నాయన్నారు. పెదమాకవరం బాలికల పాఠశాలలో సీట్లు ఖాళీలున్నట్టు హెచ్‌ఎం దేవేశ్వరరావు ఆదివారం తెలిపారు. మూడో తరగతిలో- 40సీట్లు, నాలుగులో- 31, అయిదులో-23, ఆరో తరగతిలో- 31 సీట్లు ఖాళీలున్నాయని విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పార్టీ మరింత బలోపేతానికి కృషి



కార్యక్రమానికి వచ్చిన ఆడాకుల, ఆర్.కొత్తూరు గ్రామస్తులతో నేతలు



భోజనాలు వడ్డిస్తున్న వైస్ ఎంపీపీ వెంకటరమణ

కొయ్యూరు: పాడేరు ఎమ్మెల్యేగా విశ్వేశ్వరరాజు గెలుపొందడంపై ఆదివారం ఆడాకుల పంచాయతీ కిష్టారంలో వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ ఆధ్వర్యంలో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆడాకుల సెగ్మెంట్‌కు సంబంధించి ఆర్.కొత్తూరు, ఆడాకుల పంచాయతీల నుంచి భారీ స్థాయిలో ప్రజలు వచ్చారు. వైస్ ఎంపీపీ వెంకటరమణ మాట్లాడుతూ పాడేరు ఎమ్మెల్యేగా ఎన్నికైన మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు మండల వాసుల తరపున అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. రానున్న ఐదు సంవత్సరాలు పార్టీ మరింత బలోపేతం చేయడం కోసం పనిచేయాలని కోరారు.స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పార్టీని విజయపథంలో నడిపించేందుకు కృషి చేయాలన్నారు. ఈ రెండు పంచాయతీల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీని గెలుపించుకునేందుకు కృషి చేయాలని ఆయన ధైర్యం చెప్పారు. సెగ్మెంట్ పరిధిలో ఉన్న పార్టీ కార్యకర్తలు, నేతలు అందరికీ అందుబాటులో ఉంటామన్నారు. వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జి అప్పన గజ్జియ్యదొర, నేతలు గమధం వీరబ్రహ్మం, గాడి అచ్చిరాజు, మాజీ సర్పంచ్ గమదం గంగయమ్మ, మాజీ ఎంపీటీసీ గమదం రాములమ్మ, గ్రామస్తులు బొడారపు అప్పారావు, రెడ్డి నాయుడు, ఆర్ కొండబాబు, వెంకటరమణ, కన్నయ్యదొర, నాగన్నదొర, నూకరాజు లవరాజు, కొండబాబు, జంపా శ్రీను పాల్గొన్నారు

ఘనంగా సత్తెమ్మతల్లి అమ్మవారి పండగ

మునగపాక: మునగపాక దళితవాడలో ఆదివారం సత్తెమ్మతల్లి అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. కాలనీ వాసులంతా డప్పు వాయిద్యాల నడుమ ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న మొక్కులు చెల్లించుకున్నారు.

మోదకొండమ్మ జాతర చిత్రాలు



జాతరను సందర్శించిన కలెక్టర్ విజయ సునీత కుటుంబం



జాతర సందడి